కొండవీడు.. చిచ్చర పిడుగులే చూడు..!

- వివిధ అంశాల్లో పాఠశాల విద్యార్థుల ఉత్తమ ప్రతిభ
- సమన్వయంతో ముందుకు సాగుతున్న ఉపాధ్యాయులు



సాధించిన పతకాలు, జ్ఞాపికలతో విజయ సంకేతం చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

యడ్లపాడు: కొండవీడు గ్రామంలోని పీఎంశ్రీ మండల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటుతున్నారు. చదువుతోపాటు వివిధ రంగాల్లో సత్తా చూపుతున్నారు. పాఠ్యపుస్తకాల జ్ఞానంతో సరిపెట్టుకోకుండా సైన్స్ ప్రాజెక్టులు, హ్యాండ్ రైటింగ్, గ్రీటింగ్ కార్డ్స్, క్విజ్, అబాకస్ వంటి విభాగాల్లో ప్రతిభ చాటుతూ పాఠశాల ఖ్యాతి పెంచుతున్నారు. హెడ్ మాస్టర్, ఏడుగురు ఉపాధ్యాయులు సమన్వయంతో వారిని తీర్చిదిద్దుతున్నారు. 180 మంది విద్యార్థులుండగా వారికి పలు అంశాలపై అవగాహన, శిక్షణ, ప్రవేశం కల్పిస్తున్నారు. అందరికీ ఆదర్శంగా నిలిచిన ఈ పాఠశాల ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే అత్యుత్తమ మోడల్ స్కూల్‌గా అవతరించింది. పాఠశాల విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లోనూ ప్రతిభ నిరూపించుకున్నారు.

విజయాల జాబితా ఇదీ..

- 2016: 8వ తరగతి విద్యార్థి ఎ.అఖిల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జరిగిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ద్వితీయ బహుమతి, చెంఘీజ్‌ఖాన్ పేట యూపీ స్కూల్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రథమ బహుమతి.
- 2017: జన్మభూమి–మా ఊరు సాంస్కృతిక కార్యక్రమాల్లో మండల స్థాయిలో పాఠశాలకు ప్రథమ బహుమతి.
- 2018: సాలస కాంప్లెక్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో పాఠశాల విద్యార్థులకు మొదటి బహుమతి.
- 2021: నేషనల్ చిల్డ్రన్స్ సైన్స్ కాంగ్రెస్‌లో పర్యావరణ ప్రాజెక్టుకు గుంటూరులో ప్రథమ బహుమతి.
- 2023: హ్యాండ్ రైటింగ్ రాష్ట్ర స్థాయి పోటీల్లో 8వ తరగతి విద్యార్థులు ఎల్.స్వాతి, వి.పూజ నాలుగో ర్యాంకు.
- 2023: రంగోత్సవ్‌లో పాఠశాల 34 గోల్డ్ మెడల్స్, 10 బ్రాంజ్ మెడల్స్ గెలుచుకుంది.
- 2024: 140 మంది విద్యార్థులకు డబుల్ పెన్సిల్ కాలిగ్రఫీలో 'వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు
- 91 మంది హిందీ భాషా పరిచయ, ప్రాథమిక పరీక్షల్లో ఉత్తీర్ణులు.
- అంతర్జాతీయ రంగోత్సవ్ పోటీల్లో 36 మంది విద్యార్థులకు 1, 2 స్థానాలు సాధించి 26 మెడల్స్ కైవసం చేసుకున్నారు.
- 2025: రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో క్విజ్‌లో కె. జ్యోత్స్న, ఎల్ స్వాతి, ఎంఎస్‌వీ అలిచరణ్ ప్రథమ బహుమతి.
- డైట్‌లో రాష్ట్రస్థాయి రంగోత్సవ్ క్విజ్ పోటీల్లో మొదటి స్థానం, రంగోలీలో తృతీయ స్థానం, డిజిటల్ పోస్టర్ పోటీల్లో ద్వితీయ, తృతీయ బహుమతులు.
- యోగి వేమన జయంతి పద్య పోటీల్లో మొదటి బహుమతి.

అనేక పురస్కారాలు

- 2013లో హెచ్‌ఎం జి. శ్రీనివాసరావుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు
- 2016లో మండల స్థాయి టీఎల్‌ఎం ప్రదర్శనలో పాఠశాలకు ప్రథమస్థానం
- 2017లో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును హెచ్‌ఎం జి. శ్రీనివాసరావు ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి అందుకున్నారు.
- 2018లో పాఠశాలకు న్యూజిలాండ్ మార్వెలెస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు
- 2018లో రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలోనూ స్వచ్ఛవిద్యాలయ పురస్కారం
- 2020, 2023లలో 'స్వచ్ఛ విద్యాలయ' పురస్కారాలు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో కైవసం
- 2022లో జి. శ్రీనివాసరావు 'సూపర్ –30' జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గెలుచుకున్నారు.
- 2024లో పాఠశాలలో హిందీ పరీక్షా కేంద్రం ఏర్పాటు

అన్నివిధాలా తీర్చిదిద్దడమే లక్ష్యం



విద్యార్థులకు చదువు చెప్పడం ఒక్కటే కాకుండా అన్ని అంశాల్లో ఆల్ రౌండర్లుగా తీర్చిదిద్దాలన్నదే మా లక్ష్యం. కళలు, సాంకేతికత, సామాజిక సేవలో సత్తా చాటేలా చూస్తున్నాం. అందుకే పాఠశాలకు స్కౌట్, ఎన్‌సీసీ తెచ్చాం. ఎస్ఎస్ఎస్ దశాలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాం.

– జి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం

ఉపాధ్యాయుల ప్రోత్సాహమే కారణం



పోటీలంటే భయం లేకుండా ఆసక్తిని పెంచుతూ టీచర్లు బాగా ప్రోత్సహిస్తున్నారు. అందుకే రంగోత్సవ్ క్విజ్ పోటీల్లో జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి విజేతలయ్యాం. త్వరలో ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరుకానున్నాం. చాలా హ్యాపీగా ఉంది.

– కె.మేరిజ్యోత్స్న, ఎంపీఎస్‌వీ చరణ్, ఎల్ స్వాతి, విద్యార్థులు

చాలా విషయాలు నేర్పుతున్నారు



బడికి వెళ్లి ఏం చేస్తారని అడిగితే చాలామంది పిల్లలు చదువుకుంటున్నాం అంటారు. కానీ మమ్మల్ని ప్రశ్నించిన వారికి మాత్రం చెప్పేది ఒక్కటే... బడిలో చాలా విషయాలు తెలుసుకుంటున్నామని. వివిధ పోటీలకు సిద్ధం అవుతున్నాం. విజేతలుగా నిలిచి తల్లిదండ్రులకు, గురువులకు పేరు తెస్తాం.

– షేక్ రూఫియబాను, జె శశిరేఖ, వి.పూజ, విద్యార్థినులు

క్లుప్తంగా

పదోన్నతిపై బదిలీ



ఎం.అర్జున్‌నాయక్

బొల్లాపల్లి : మండల డిప్యూటీ తహసీల్దార్ ఎం. అర్జున్‌నాయక్ పదోన్నతి పొంది రెంటచింతల మండలానికి బదిలీ అయ్యారు. తాత్కాలిక పదోన్నతి ద్వారా పూర్తి అదనపు బాధ్యతలతో రెంటచింతల మండలానికి తహసీల్దార్‌గా బదిలీపై వెళ్లినట్లు ఈ మేరకు మండల తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. అర్జున్ నాయక్ 2019లో వినుకొండ నియోజకవర్గంలోని నూజెండ్ల మండల డీటీగా బాధ్యతలు చేపట్టారు. 2024 సెప్టెంబరులో బొల్లాపల్లికి బదిలీపై వచ్చారు.

కాలనీ ఏర్పాటుకు సహకారం అభినందనీయం



వినుకొండ(నూజెండ్ల): ఏజీపీగా నూతనంగా ఎన్నికైన ముప్పాళ్ల జ్ఞానేశ్వరరావును ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ (ఏఐసీసీ) నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రెవ. కొత్త డేవిడ్ మాట్లాడుతూ పాస్టర్స్ కాలనీ ఏర్పాటుకు సహకరించినందుకు ఏజీపీకి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకులు జె.బుజ్జిబాబు, టి.ప్రభుదాస్, కె.సుదర్శనం, సువర్ణరాజు, వై.యేసుపాదం, ఆశీర్వాదం, మోషే, ఇస్సాక్, లాజర్, మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన ముఖ్యం



చిలకలూరిపేట: ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ కేఎల్ రావు చెప్పారు. జాతీయ రహదారి భద్రతా మహోత్సవాల్లో భాగంగా పట్టణంలోని నారాయణ స్కూల్‌లో 9, 10వ తరగతి విద్యార్థులకు రహదారి భద్రతపై వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో కేఎల్ రావు మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయరాదని చెప్పారు. ర్యాష్ డ్రైవింగ్‌తో ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులకు విధించబడే జరిమానాల గురించి వివరించారు. వ్యాసరచన పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ శేషగిరిరావు, ఏజీఎం లక్ష్మణరెడ్డి పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఎన్నికలు



వినుకొండ (నూజెండ్ల): వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ వీ204ఏ జిల్లా గవర్నర్ మునగాల చిరంజీవి వినుకొండ పట్టణంలో పర్యటించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్‌లో పదవులు పొందిన పలువురికి నియామక పత్రాలను అందజేశారు. క్లబ్ ప్రెసిడెంట్‌గా కాసుల వెంకటరవీంద్ర, సెక్రటరీగా టి. వీరబ్రహ్మం, ట్రెజరర్‌గా సిద్ధా నరేష్, వనితా క్లబ్ ప్రెసిడెంట్‌గా గుడిపాటి శేషపద్మజ, వాసవి యూత్ క్లబ్ అధ్యక్షుడిగా గుర్రం బాలసాయికుమార్, వాసవి క్లబ్ వైభవం వెల్లటూరు అధ్యక్షునిగా గజవల్లి వెంకట సుబ్బయ్యలను ఎన్నుకున్నట్లు చిరంజీవి తెలిపారు. జిల్లా కమిటీలో పలువురి నియామకం జరిగినట్లు వివరించారు. అనంతరం గవర్నర్ చిరంజీవిని ఘనంగా సత్కరించారు.

ఒయాసిస్ సంస్థ సేవలు ప్రశంసనీయం

చిలకలూరిపేట: ఒయాసిస్ సంస్థ సేవలు ప్రశంసనీయమని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ 18వ వార్షికోత్సవాలు రోటరీ కమ్యూనిటీ హాలులో బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు సంస్థ నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ.. సంస్థ అండగా నిలుస్తున్న తీరును మెచ్చుకున్నారు. పలువురికి కుట్టుమిషన్లు, ట్రైసైకిళ్లు, విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మను సన్మానించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంస్థ కార్యదర్శి కరణం విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకోండి

శావల్యాపురం: స్వయం సహాయక మహిళా సంఘాల్లోని సభ్యులు స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం జి.వాసుబాబు అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో బయోమెట్రిక్ నమోదుతో పాటు వీఓఏలకు స్త్రీనిధి రీకవరీ పేటీఎం మిషన్లు పంపిణీ చేశారు.

గాంధీ మార్గం అనుసరణీయం



శాఖా గ్రంథాలయంలో నివాళులు అర్పిస్తున్న ప్రతినిధులు



గాంధీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న న్యాయవాదులు



ఆర్యవైశ్య సంఘం, వాసవీక్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో...

నరసరావుపేట ఈస్ట్: మహాత్మాగాంధీ సూచించిన మార్గం అనుసరణీయం అని శ్రీనాథ సాహితీ పరిషత్ కార్యదర్శి స్వర్ణ చినరామిరెడ్డి తెలిపారు. పల్నాడురోడ్డులోని శాఖా గ్రంథాలయంలో గురువారం గాంధీ వర్ధంతి సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారిణి యడ్లపాటి రాధ, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నరసరావుపేట టౌన్: న్యాయవాద సంఘం కార్యాలయంలో గాంధీకి నివాళులు అర్పించారు. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. న్యాయవాద సంఘ అధ్యక్షుడు మేదర మెట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు గాంధీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. న్యాయవాదులు కె. విజయ్ కుమార్, జీనేపల్లి హనుమంతరావు, బొల్లా సురేష్, వై. శ్రీనివాస్ రెడ్డి, సి.హెచ్.రాజేశ్వరరావు, ఎండీ షరీఫ్, మల్లికార్జున రావు పాల్గొన్నారు.

నాదెండ్ల: అహింసా మార్గం చూపిన మహనీయుడు గాంధీ అని హెచ్‌ఎం ఐ కృష్ణానాయక్ కొనియాడారు. గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, బాజీబాబు, జి ఉషారాణి పాల్గొన్నారు.

- గణపవరం బొడ్డురాయి సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి ఆర్యవైశ్య సంఘం, వాసవీ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. కార్యక్రమంలో నాయకులు టి.అనిల్‌కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.


నరసరావుపేట: గాంధీ వర్ధంతి సందర్భంగా నియోజకవర్గ, పార్లమెంటు టీడీపీ కార్యాలయాల్లో జిల్లా పార్టీ అధ్యక్షులు కొమ్మాలపాటి శ్రీధర్, శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబులు గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం పట్టణంలో మున్సిపల్ కార్యాలయం వద్ద గల గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఏఎంరెడ్డి కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు



నరసరావుపేట రూరల్: ఏఎంరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 24 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్టు కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి తెలిపారు. బెంగళూరుకు చెందిన నైరా సంస్థ వర్చువల్ డ్రైవ్ ద్వారా ఇంటర్వ్యూలను నిర్వహించింది. వీరికి రూ.3.5 లక్షల వార్షిక వేతనం అందిస్తారని తెలిపారు. విద్యార్థులను కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి, ప్రిన్సిపల్ డాక్టర్ సీహెచ్ మల్లికార్జున్, డిప్లొమా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.కృష్ణారెడ్డి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎ.కిషోర్‌రెడ్డి, విభాగాధిపతులు, సిబ్బంది అభినందించారు.

మున్సిపల్ ప్రత్యేక సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ దస్తగిరి

వినుకొండ(నూజెండ్ల): పురపాలక సంఘం ప్రత్యేక సమావేశం చైర్మన్ డాక్టర్ దస్తగిరి అధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. 2025–26 సంవత్సరపు బడ్జెట్ అంచనాలు గతేడాది సవరించబడిన బడ్జెట్ అంచనాల ప్రతిపాదనలుపై సభ్యులు చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మున్సిపల్ అప్పులు తెలపకుండా ఎందుకు దాస్తున్నారని, అప్పులు ఎలా తీరుస్తారని నిలదీశారు. ఆదాయాన్ని మించి అప్పులు మున్సిపాలిటీకి ఉన్నాయా అని అడిగారు. ఎన్ఎస్‌పీ కాలువల మీద ఏర్పాటు చేసిన చైర్మన్ పేరు ఎందుకు తొలగించారు, చైర్మన్ పదవిలో లేరా? అని కౌన్సిలర్ షకీలా అధికారులను ప్రశ్నించారు. అనంతరం చైర్మన్ డాక్టర్ దస్తగిరి మాట్లాడుతూ గురువారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం, అత్యవసర సమావేశం ఒకే సమయానికి ఎలా నిర్వహిస్తారని అధికారులను ప్రశ్నించారు. బడ్జెట్ ప్రతిపాదనలకు కౌన్సిల్ ఆమోదం తెలిపారు. అత్యవసర సమావేశాన్ని రద్దు చేస్తున్నట్లు చైర్మన్ తెలిపారు.

సృజనాత్మకత చాటేలా వైజ్ఞానిక ప్రదర్శన



నరసరావుపేట ఈస్ట్: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేలా విద్య, వైజ్ఞానిక ప్రదర్శనలు ఉండాలని కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు తెలిపారు. కళాశాలలో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వైజ్ఞానిక ప్రదర్శనను గురువారం ఆయన ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులను తిలకించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఎంఆర్‌కే సతీష్‌బాబు, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ డి.యోగేశ్వరరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు



నరసరావుపేట రూరల్: ప్రకృతి వ్యవసాయంతో మంచి ఆహారాన్ని తీసుకోవడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం కె.అమలకుమారి తెలిపారు. పట్టణంలోని కార్యాలయంలో పల్నాడు, బాపట్ల జిల్లాల రైతు శాస్త్రవేత్తల శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. డీపీఎం అమలకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూమికి మేలు జరుగుతుందని తెలిపారు. రైతుల విజయాలను తెలియజేశారు. డీపీపీలు, టీపీపీలు, వైఆర్ఎఫ్, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాలల విలీనం విరమించుకోవాలి




నరసరావుపేట ఈస్ట్: ఉర్దూ పాఠశాలలను తెలుగు పాఠశాలల్లో విలీనం చేసే ప్రయత్నాన్ని వెంటనే విరమించుకోవాలని మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి (ఎంహెచ్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి షేక్.మస్తాన్‌వలి తెలిపారు. ఉర్దూ పాఠశాలల విలీనాన్ని నిరసిస్తూ గురువారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మస్తాన్‌వలి మాట్లాడుతూ.. ఇలాంటి విధానాలను వెంటనే విరమించుకోవాలని కోరారు. జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ రఫీ, కార్యదర్శి ఖాసీంపీరా, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గోదా జాన్‌పాల్, సీపీఐ నాయకుడు ఉప్పలపాటి రంగయ్య, టీడీపీ మైనారిటీ నాయకులు మీరావలి, రసూల్, బడే బాబు మాబుబాష తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ వ్యర్థాలు పారబోస్తే చర్యలు

నరసరావుపేట: పురపాలక పరిధిలోని బైపాస్ రోడ్డు, రోడ్ల మార్జిన్లలో బిల్డింగ్ మెటీరియల్, చెత్తాచెదారం వేసిన వారికి జరిమానా విధిస్తామని మున్సిపల్ కమిషనర్ ఎం.జస్వంతరావు గురువారం పేర్కొన్నారు. ఇటువంటి వాటిని వేసేందుకు సహకరించిన వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు



నాదెండ్ల: గుంటూరు–కర్నూలు జాతీయ రహదారి సాతులూరు సమీపంలోని పెట్రోల్‌బంకు వద్ద కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. వినుకొండ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సును కారు వేగంగా వచ్చి ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయాలపాలయ్యారు. 108 సాయంతో నరసరావుపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. క్షతగాత్రుల వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తత అవసరం



నరసరావుపేట ఈస్ట్: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సైబర్ సెక్యూరిటీ డిపార్ట్‌మెంట్ చీఫ్ కౌన్సిలర్ కొత్తపల్లి ప్రదీప్ తెలిపారు. విక్టరీ డిగ్రీ కళాశాలలో గురువారం సైబర్ నేరాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రదీప్ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు సరికొత్త ఎత్తులతో మోసాలకు పాల్పడుతున్న విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల కార్యదర్శి ఒద్దుల సుబ్బారెడ్డి, డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ పి.వేణుగోపాల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బోధకాలు వ్యాధిని నిర్మూలించవచ్చు

నరసరావుపేట: సత్వరమే బోధకాలు, గినివార్మ్ వ్యాధులను గుర్తించి తగిన చికిత్స చేయటం ద్వారా అరికట్టవచ్చని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రవీంద్ర రత్నాకర్ పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో గురువారం ప్రపంచ ఉష్ణమండల నిర్లక్ష్యవ్యాధుల డేని పురస్కరించుకొని అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాల పరిశీలన



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలంలోని మోడల్ విలేజ్‌లైన జంగాలపల్లి, తలార్లపల్లి గ్రామాల్లోని చెత్త సంపద తయారీ కేంద్రాలను ఈవోపీఆర్‌డీ షేక్ రబ్బాని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల వద్ద కంప చెట్లను తొలగించి నీడనిచ్చే చెట్లను నాటాలన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛ భారత్ ఎంఆర్‌సీ కంచర్ల సుబ్బరామయ్య, సచివాలయ సిబ్బంది, పెద్దలు పాల్గొన్నారు.

నూజెండ్ల(శావల్యాపురం): నూజెండ్ల మండలంలోని మోడల్ గ్రామాలైన జంగాలపల్లి, తలార్లపల్లి గ్రామాల్లో కూడా చెత్త సంపద కేంద్రాలను షేక్ రబ్బాని పరిశీలించారు. స్వచ్ఛ భారత్ రీసోర్స్ కోఆర్డినేటరు కంచర్ల సుబ్బరామయ్య, సిబ్బంది గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పాడి రైతులు పథకాలను వినియోగించుకోవాలి

బొల్లాపల్లి: మండలంలోని పలుకూరు, మేళ్లవాగు గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశు వైద్య శిబిరాలు నిర్వహించారు. పలుకూరులో ఆ శాఖకు చెందిన ఈపూరు సహాయ సంచాలకులు పి.శ్రీనివాసమూర్తి పశువులకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలు జాతి దూడల ఉత్పత్తి, పశుగ్రాసం సాగు, పశు అభివృద్ధికి ప్రభుత్వాలు అందించే ప్రోత్సాహకాలు, పథకాల గురించి వివరించారు. మేళ్లవాగు శిబిరంలో బొల్లాపల్లి పశువైద్యాధికారి పి.అమీర్‌బాషా, మేళ్లవాగు పశువైద్యులు వెంకటాద్రి చికిత్స అందజేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది, ఆయా గ్రామపెద్దలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డిని కలిసిన జిల్లా విభాగాల నూతన అధ్యక్షులు, పార్టీ నాయకులు

నరసరావుపేట: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కోరారు. పల్నాడు జిల్లాకు రైతు విభాగం, విద్యార్థి విభాగ అధ్యక్షులుగా ఎంపికైన అన్నెం పున్నారెడ్డి, గుజ్జర్లపూడి ఆకాష్ కుమార్ గురువారం పార్టీ కార్యాలయంలో డాక్టర్ గోపిరెడ్డిని కలిశారు. వారికి గోపిరెడ్డి దుశ్శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయని ప్రభుత్వ తీరుపై పోరాడాలన్నారు. జిల్లాలోని పార్టీ శ్రేణులను కలుపుకొని ప్రజల పక్షాన నిలవాలని కోరారు. పున్నారెడ్డి, ఆకాష్‌లు మాట్లాడుతూ.. డాక్టర్ గోపిరెడ్డి తమ సేవలను గుర్తించి పెద్ద బాధ్యతను అప్పగించారన్నారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడతామని పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే గోపిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పదముత్తం చిట్టిబాబు, ఎస్టీ సెల్ జోనల్ ఇన్‌చార్జి పాలపర్తి వెంకటేశ్వరరావు, రొంపిచర్ల మండల కన్వీనర్ కురుగుంట్ల శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ గాదె రామిరెడ్డి, షేక్ కరిముల్లా, నాయకులు పంగులూరి విజయకుమార్, గంటెనపాటి గాబ్రియేలు, పల్లపు ఆంజనేయులు, పానుగోటి వెంకటరావు, సయ్యద్ కరిముల్లా, బాల శ్రీనివాసరెడ్డి, వరవకట్ట బుజ్జి, అన్నం వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మేజర్ కాలువలకు మరమ్మతులు



హెల్త్ క్లబ్ వద్ద మురుగు కాలువలు శుభ్రం చేస్తున్న సిబ్బంది

నాదెండ్ల: జాతీయ రహదారిపై గణపవరం గ్రామ పరిధిలోని చెక్‌పోస్టు వద్ద నుంచి కుప్పగంజి వాగు వరకు మురుగునీరు పారుదల శాశ్వత పరిష్కారం కోసం గత రెండురోజులుగా చురుగ్గా పనులు సాగుతున్నాయి. రహదారికి తూర్పువైపు పనులు పూర్తి కావచ్చాయి. పడమర వైపు ఏఎంజీ వద్ద నుంచి కుప్పగంజివాగు వరకు మురుగునీరు పారుదలకు ప్రపోజల్స్ తయారు చేస్తున్నారు. మరి కొద్ది రోజుల్లో ఏఎంజీ వద్ద నుంచి ఆక్రమణలు తొలగించనున్నారు. గణపవరం డొంకరోడ్డులో తరచూ వర్షాలు కురుస్తుండటం, చిలకలూరిపేట మురుగునీరు ఈ కాలువ ద్వారా రావటం వల్ల కొన్ని రోడ్లు దెబ్బతింటున్న విషయంపై కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదులు చేసిన విషయం విదితమే. మున్సిపల్ కమిషనర్ శ్రీహరి బాబు, డీఈ రహీం, ఏఈ సీహెచ్ శ్రీనివాసరావుతో కలిసి శాశ్వత పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు.

తామరతో నిండిన సీతమ్మ చెరువు



తామర మొక్కలతో పచ్చదనంతో నిండిన చెరువు

యడ్లపాడు: స్థానిక పోలీస్‌స్టేషన్ వెనుక కొండకు ఆనుకుని ఉన్న సీతమ్మ చెరువు ప్రస్తుతం తామర మొక్కలతో నిండింది. మైదవోలు, యడ్లపాడు గ్రామాలను కలుపుతూ విశాలంగా విస్తరించిన ఈ చెరువులో ఉపాధి హామీ పనులు నిర్వహించకపోవడంతో తామర మొక్కలు పెరిగి చెరువంతా వ్యాపించాయి. నీటి నిల్వతో విస్తారంగా పూలు పూశాయి. దూరం నుంచి చూస్తే ఈ చెరువు ఆహ్లాదాన్ని పంచుతోంది. దీనిని తాగునీటి ప్రాజెక్టుగా మార్చాలన్న గ్రామస్తుల కోరిక మాత్రం ఎంతకూ తీరడం లేదు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో మండల పరిషత్ సమావేశం దృష్టికి ఈ విషయం తెచ్చి ప్రజల వినతిని పరిశీలించాలని కోరడంతో ప్రజా ప్రతినిధులు ఆమోదించిన విషయం విదితమే. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి గ్రామ నీటి అవసరాలు తీర్చే రక్షిత మంచినీటి పథకానికి చెరువును ఉపయోగించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్యకర పశువులతో ఎక్కువ లబ్ధి



నాదెండ్ల: ఆరోగ్యకర పశుసంపదతో లాభాలు సాధ్యమని పశువైద్యాధికారి శ్రీలక్ష్మి చెప్పారు. కనపర్రు శివారు మల్లాయపాలెం గ్రామంలో గురువారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పలు పశువులకు వైద్య సేవలు చేశారు. సిబ్బంది శ్రీనివాసరావు, ఖుదాన్‌షా, గోపీ, రజనీకాంత్, సత్యవతి, హబీబ్, సుభాని, నాయకులు పాల్గొన్నారు.